క్లుప్తంగా

3న సర్వసభ్య సమావేశం

శెట్టూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి మంగళవారం తెలిపారు. అధికారులు గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు, వాటి పరిష్కార వివరాలతో రావాలన్నారు. మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

పంటల నమోదు పక్కాగా చేపట్టండి

కూడేరు: రబీలో సాగు చేసిన పంటల నమోదు పక్కాగా చేపట్టాలని ఏఓ నవత ఆదేశించారు. మంగళవారం ఆమె తిమ్మాపురంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్ రైతులను గుర్తించి ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. అనంతరం పప్పుశనగ పంటకోత ప్రయోగం చేపట్టారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీహెచ్ఏ, వీవీఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో అనీమియాకు చెక్

శెట్టూరు: పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేపట్టారు. గ్రామ సచివాలయ పరిధిలో 519 మంది కిశోర బాలికలుండగా 466 మందికి రక్తహీనత ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపడంతోపాటు, కలెక్టర్ వీసీలో సమస్య లేవనెత్తడంతో ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అయితే ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిందన్నారు. వాస్తవానికి ఒక్కరు మాత్రమే అనీమియాతో ఉన్నట్లు ఆయన గుర్తించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి, ఎంఈఓ శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, వైద్యుడు కార్తీకేయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు తోడ్పడండి

ఉరవకొండ: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా లెప్రసీ అధికారిణి అనుపమజేమ్స్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి జిల్లా పారామెడికల్ ఆఫీసర్ రవికుమార్, ఉరవకొండ ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ సాహితీ, సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్, జిల్లా పారామెడికల్ అసిస్టెంట్ అధికారి తిప్పేస్వామి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గాంధీ వర్ధంతిను పురస్కరించుకుని ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అవగాహనతోనే నివారణ

కంబదూరు:అవగాహనతోనే కుష్టు వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అచ్చంపల్లిలో వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స గురించి వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. కుష్టు వ్యాధి ప్రమాదకరమైన వ్యాధి కాదని ప్రాథమిక దశలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండొచ్చన్నారు. సీహెచ్ఓ సత్యవతి, ఏఎన్ఎం సవారమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కామక్షి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వన్నూరుస్వామి ఉరుసు

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో కులమతాలకు అతీతంగా వన్నూరుస్వామి ఉరుసు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో చక్కెర తులాభారం చేయించి భక్తులు మొక్కుబడులను తీర్చుకొన్నారు. స్వామి వారి ప్రతి రూపంగా భావించే షంషీర్‌ను అశ్వంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దర్గాలో ప్రత్యేక పూజలు చేయించి ఆశీస్సులు తీసుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచు పాటిల్ శారద, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, గిర్రప్పరెడ్డి, భీమిరెడ్డి, బి.రామక్రిష్ణ, టైలర్ వెంకటేశులు, రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం లీజుకు టెండర్ల ఆహ్వానం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో 15 ఏళ్ల పాటు లీజుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆదోని తెలిపారు. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో మంగళవారం డిప్యూటీ ఈఈ సురేంద్ర, స్థానిక డీఎం రామచంద్రతో కలసి వ్యాపారులతో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఓపెన్ స్థలంలో వ్యాపారాలు చేయడానికి లీజు పద్ధతిన స్థలాన్ని కేటాయిస్తున్నామన్నారు. పోటీదారులు టెండర్లు వేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్లు దక్కించుకున్న వారికి స్థలాన్ని 15 ఏళ్ల పాటు లీజుకు కేటాయిస్తామన్నారు. వివరాలకు స్థానిక డిపో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ప్రీ బిడ్ మీటింగ్‌లో పాల్గొన్న వ్యాపారులు అడిగిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు.

మేలు చేస్తున్న జగనన్నను ఆశీర్వదించండి



కణేకల్లు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: షేక్షానుపల్లిలో బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కణేకల్లు: హామీలన్నీ నెరవేర్చాం.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాం.. పింఛన్, రేషన్‌తోపాటు పలు పథకాలు మీ ఇంటివద్దే అందిస్తున్నాం. ఇంతలా మేలు చేస్తున్న సీఎం జగనన్నను అందరూ మరోమారు ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని అంబాపురం గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు పాటిల్ భారతి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పర్వతరెడ్డితో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ అవినీతి ఆస్కారం లేకుండా అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతోందన్నారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు, వంకలు, వాగుల్లో పూడికతీత పనులతో పేదలకు అందించాల్సిన సొమ్మును చంద్రబాబు అండ్ కో పందికొక్కుల్లా దోచుకొన్నారని మండిపడ్డారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు, సిమెంటు రోడ్ల సమస్యలుండటంతో వాటిని తక్షణమే పరిష్కరించాలని విప్ కాపు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, ఆదర్శభారతి సొసైటీ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, మండల సచివాలయ కన్వీనర్ హనుమంతరావు, నాయకులు యంత్రకాయల వంద్రప్ప, కెనిగుంట రామిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, దివాకర్‌రెడ్డి, ధనుంజయ్య, అశోక్, మల్లికార్జున, బసవనందా తదితరులు పాల్గొన్నారు.

షేక్షానుపల్లి అభివృద్ధికి 8.21 కోట్లు మంజూరు

ఉరవకొండ: షేక్షానుపల్లి గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మూడేళ్లలో రూ.8.21 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని షేక్షానుపల్లి, కోనాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ షేక్షానుపల్లి గ్రామానికి రూ.2కోట్లతో రోడ్డు నిర్మాణం, నాడు–నేడు, రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవన నిర్మాణం, వైఎస్సార్ క్లినిక్‌కు రూ.4 కోట్ల వరకూ ఖర్చు పెట్టామన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.4 కోట్ల వరకూ వెచ్చించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, సర్పంచ్ లింగన్న, ఎంపీటీసీ రామలింగ, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ సుంకన్న, నాయకులు గుర్రం శ్రీనివాసులు, నాగభూషణం, అయ్యప్పరెడ్డి, ఎల్లప్ప, అశోక్, నారరాజు, రామచంద్ర, సుంకేనాయక్, ఓబన్న, ఎంఈఓ ఈశ్వరప్ప, ఏఓ శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం చేసుకుందాం..

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎం చేసుకుందామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని కామక్కపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలతో మాట్లాడారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, మహిళా రుణమాఫీ, గ్రామంలోనే మెరుగైన వైద్యం అందుతోందా అని ఆరా తీశారు. ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నకు అందరూ అండగా నిలవాలని మంత్రి కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంతో గౌరవం దక్కిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గమ్మ , జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, ఉప సర్పంచ్ నారాయణస్వామి, నాయకులు మల్లికార్జున, బొజ్జన్న, మల్లన్న, వెంకటేశులు, హనుమంత రాయుడు, నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, జయపాల్‌రెడ్డి, శ్రీధర్‌చంద్ర, కృష్ణారెడ్డి, జానకిరామిరెడ్డి, తిమ్మరాజులు, గంగాధర, తిమ్మరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు అండగా ఉంటాం



పేదల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమించే జగనన్న మళ్లీ సీఎం కావాలి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి మాకు అన్ని విధాలుగా సాయం అందుతోంది. మాకు మంచి చేసిన జగనన్నను ఎన్నటికీ మరువం. కల్లబొల్లి మాటలు చెప్పే టీడీపీని ఎప్పటికీ నమ్మేది లేదు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నకు అండగా ఉంటాం.

– మంజుల, అంబాపురం, కణేకల్లు

ముఖ్యమంత్రి సాయం మరువలేం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబానికి చేసిన సాయం మరువలేం. నాకు వితంతు పింఛన్, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, నా కూతురుకు దివ్యాంగ పింఛన్ మూడేళ్లలో మొత్తం రూ.2.74 లక్షలు లబ్ధి పొందాం. ఎవరి సిఫారసులు లేకుండానే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. జగనన్నను అండగా ఉంటాం.

–గోవిందమ్మ, కామక్కపల్లి, కళ్యాణదుర్గం

మహనీయుడు యోగి వేమన



వేమన, వేమారెడ్డి మల్లమ్మకు రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులతో కలసి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఏపీఐఐసీ చైర్మన్

రాయదుర్గం రూరల్: సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో పద్య శతకాన్ని అందించిన మహనీయుడు యోగివేమన అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి దేవాలయ కల్యాణ మండపంలో రెడ్డి సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు గౌని ఉపేంద్ర రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన యోగి వేమన జయంతుత్సవాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత వారు యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి , పూజలు నిర్వహించి , జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగి వేమన రచించిన పద్యాలతో విప్ ప్రసంగాన్ని ప్రారంభించారు. రాజభోగాలతో అలరారిన మహారాజు యోగి వేమన జీవిత సత్యం తెలుసుకుని యోగిగా మారాడన్నారు. ఈ నేలపై ఏదీ శాశ్వతం కాదని ఇతరులకు సహాయం చేసే గుణం మనిషి నైతికతకు నిదర్శనమన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మాట్లాడుతూ రెడ్డి కులస్తులు ఐకమత్యంతో ఉండి సమాజంలో మరింత గౌరవం పెంపొందించుకోవాలన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి రెడ్డి వర్గానికి చెందిన నిరుపేద కుటుంబ పిల్లల చదువుకు సంఘం తరపున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించామన్నారు. అలాగే సంక్షేమ భవనం నిర్మాణంలో భాగంగా స్థలసేకరణ చేపట్టడానికి అందరూ సహకారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శి జయశీలారెడ్డి, కోశాధికారి సత్యం రాజశేఖర్ రెడ్డి, గౌరవాధ్యక్షులు ఆర్టీ జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, మాధవరెడ్డి, మెచ్చిరి నాగరాజు రెడ్డి , మాజీ ఎంపీపీలు ఆలేరు రాజగోపాల్ రెడ్డి, నాగరాజురెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, నాయకులు పాటిల్ సదాశివారెడ్డి, కోకుర్తి జయరామిరెడ్డి, శివారెడ్డి, రిటైర్డ్ టీచర్ నారాయణ రెడ్డి, వీఆర్ఓ రాజగోపాల్ రెడ్డి, పీసీ రఘునాథరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటరెడ్డి, గౌని ప్రతాప్ రెడ్డి, గొల్లపల్లి కాంతారెడ్డి, ఆర్టీ కాంతా రెడ్డి, ఐదు మండలాల సంఘం ప్రెసిడెంట్లు, రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



షేక్షానుపల్లిలో సీఎం చిత్రపటానికి జగనన్నతోడు లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది కూడా చేతి వృత్తుల వారికి జగనన్న తోడు కింద రూ.10 వేలు జమ చేయడంతో మంగళవారం మండలంలోని షేక్షానుపల్లి గ్రామంలో లబ్ధిపొందిన చేతివృత్తుల వారు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సంబరాలు చేపట్టారు. రజక సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, సర్పంచ్ లింగన్న, ఎంపీటీసీ రామలింగ, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మతో కలసి మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి సంబరాలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముస్టూరు సుంకన్న, అశోక్, తేజోనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నెరిమెట్ల గ్రామంలో సర్పంచ్ యోగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో చేతివృత్తుల వారు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు.

శోభా.. రుజువులు ఇవిగో!

- లబ్ధి పొంది బుకాయించడం మంచి పద్ధతి కాదు
- మాల్యం మాజీ సర్పంచు శోభకు వైఎస్సార్‌సీపీ నాయకుల హితవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మాల్యం మాజీ సర్పంచు శోభ... ఏ ఏడాదిలో ఎంత మేరకు లబ్ధిపొందిదో రుజువులున్నాయని, ఆమె స్టేట్ బ్యాంకుకొస్తే మొత్తం ఆధారాలతో నిరూపిస్తామని కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పైనేటి తిమ్మప్పచౌదరి సవాల్ విసిరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కణేకల్లు క్రాసింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మాజీ సర్పంచు శోభ ఇంటికెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి గురించి వివరించగా.. తాను ఎలాంటి లబ్ధి పొందలేదని బుకాయించడమే కాకుండా నా అకౌంట్‌లో డబ్బులు పడినట్లు చూపిస్తే వైఎస్సార్‌సీపీలో చేరతానని ఆమె చెప్పారన్నారు. మూడున్నరేళ్ల జగనన్న పాలనలో మొత్తం రూ.66 వేల వరకు ఆమెకు లబ్ధి చేకూరిందన్నారు. రైతు భరోసా ద్వారా రూ.48 వేలు, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.18 వేలు ఆమె బ్యాంకు ఖాతాలో జమైందన్నారు. ఆమె స్టేట్‌బ్యాంకు వస్తే రుజువులు చూపిస్తామన్నారు. ఏ రోజున పార్టీ కండువా వేసుకొంటారో చెప్పాలని వారు సవాల్ విసిరారు. జగనన్న ప్రభుత్వంపై ఏదో విధంగా దుష్ప్రచారం చేయించి రాజకీయంగా లబ్ధిపొందాలని దుర్బుద్ధితో మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు చీప్ ట్రిక్స్‌కు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటివి మానుకుని బుద్ధిగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. ఎన్ని కుప్పిగంతలు వేసినా నువ్వు, చంద్రబాబు రాబోవు ఎన్నికల్లో ఓడిపోవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, గోవర్ధన్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.66 వేలు అకౌంట్‌కు జమయ్యాయి

మాల్యం మాజీ సర్పంచు శోభ అకౌంట్‌కు రైతు భరోసా కింద రూ.48 వేలు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.18 వేలు జమయ్యాయి. ఏ ఏడాదిలో ఎంత మొత్తం అనేది కూడా స్పష్టంగా ఉంది. ప్రభుత్వ పథకాలు పార్టీలను చూడకుండా అర్హత ఉన్న వారికి అందిస్తున్నాం. ఆమె లబ్ధి పొంది కూడా లేదని చెప్పడం బాధగా ఉంది. – శ్రవణ్‌కుమార్, ఏఓ

మోసం చేయడమే టీడీపీ నైజం



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: మాయమాటలతో ప్రజలను మోసం చేయడమే టీడీపీ నైజమని, అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించడంతో గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినా నీచ రాజకీయాలతో మళ్లీ అధికారం కోసం పాకులాడుతున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్, మల్లాపురం లేఅవుట్, కేబీ ప్యాలెస్ వద్ద రూ.58 లక్షల వ్యయంతో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైస్ చైర్మన్ వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలసి విప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ప్రతి సంక్షేమ పథకానికీ కౌన్సిలర్లు లంచాలతో పేదల రక్తం పీల్చిన రోజులు రాయదుర్గంలో ఏ ఒక్కరూ మర్చిపోలేదన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి శాశ్వత సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు భీమనపల్లి నాగవేణి, శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, ఫక్రుద్దీన్, వార్డు ఇన్‌చార్జ్‌లు దివాకర్, కృష్ణమూర్తి, పొరాళ్ల శివకుమార్, గోరంట్ల సత్యనారాయణ, బషీర్ అహ్మద్, నాయకులు నేత్రపల్లి కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, డీఈ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

కూడేరు: పశ్చిమ రాయలసీయ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఎంపీపీ నారాయణరెడ్డి మంగళవారం మండలంలో ప్రచారం చేశారు. ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, సూపరింటెండెంట్ నాగభూషణ రెడ్డి, సిబ్బంది, సచివాలయాల్లోని అధికారులను ఎంపీపీ కలిశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, వైఎస్సార్‌సీపీ నేతలు విజయభాస్కర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, తోపుదుర్తి రామాంజనేయులు, సత్యనారాయణ, ఓబుళపతి, ఎర్రనాగప్ప, దేవరాజ్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కుందుర్పి: మండల కేంద్రంలోని కురుబ వీధిలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కమలమ్మ తదితరులు ప్రారంభించారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.8 లక్షల వ్యయంతో స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి సాయిబాబా వాటర్ ట్యాంకు వరకూ సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఎంపీపీతోపాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీటీసీ గంగమ్మ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లి, మాలేపల్లిలో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజూనాథ మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు

కూడేరు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సీఆర్పీ రమణ, హెచ్ఎం నరసింహులు తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఎంఎంహళ్లిలో బడి బయట పిల్లల సర్వే చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి 14 ఏళ్ల వయసు పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను బాల కార్మికులుగా మార్చవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు వరం 'భవిత కేంద్రం'

రాయదుర్గంటౌన్: భవిత కేంద్రం దివ్యాంగ పిల్లలకు(ప్రత్యేక అవసరాలు గల పిల్లలు) వరమని ఎంఈఓ నాగమణి, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎంకే షమా అన్నారు. అనంతపురం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అజాద్ ఉర్దూ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఉచిత ఉపకరణాల ఎంపికకు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి 128 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరు కాగా అనంతపురం నుంచి విచ్చేసిన ఫిజియోథెరపిస్టులు ఎర్రిస్వామి, యశ్వంత్ పరీక్షించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

శెట్టూరు: మండలంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎస్ఐ యువరాజ్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకొన్నారు. కర్ణాటక ప్రాంతం తిప్పారెడ్డిపల్లి నుంచి కళ్యాణదుర్గానికి మద్యం తరలిస్తూ అంకెల నాగరాజు అనే వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 384 మద్యం డ్యకెట్లు, ద్విచక్ర వాహనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వ్యాపారికి కుచ్చుటోపీ

కుందుర్పి: కిరాణా దుకాణంలో రూ.25 వేల సరుకులతో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఉడాయించినట్లు మండల కేంద్రంలోని వ్యాపారి చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సరుకుల కోసమంటూ మాస్కు ధరించిన ఓ వ్యక్తి చంద్రశేఖర్ కిరాణా దుకాణం వద్దకు వచ్చాడు. రూ.25 వేలు విలువ చేసే సరుకులు కొన్నాడు. బిల్లు చెల్లించే సమయంలో దుకాణ యజమాని సరుకుల కోసం లోపలి గదిలోకి వెళ్లగా.. మాస్కు ధరించిన వ్యక్తి సరుకులతో పరారైనట్లు బాధితుడు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని కుష్టు రోగుల కాలనీ శివారు ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం పట్టణానికి చెందిన వెంకట్, వీరేష్ గాయపడ్డారు. వీరు ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో కిందకు పడ్డారు. క్షతగాత్రులను అనంతపురం తరలించారు.

సంక్షిప్త సమాచారం

వలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం రూరల్: మండలంలోని బీఎన్ హళ్లి, 74 ఉడేగోళం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు ఇద్దరు అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ రఘురామారావు తెలిపారు.

వాహనాల వేలం రేపు

బొమ్మనహాళ్: మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం వాహనాలను వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ శివ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన 12 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు రూ.3 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

నేటి నుంచి పింఛన్ పంపిణీ

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి మంగళవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 6,500 మంది పింఛన్‌దారులకు రూ.1.91 కోట్లు పంపిణీ చేస్తామన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

కణేకల్లు: ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని కోకుర్తి, సొల్లాపురం గ్రామాల్లోని ఆర్బీకేలను ఏఓ శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఏడీఏ సందర్శించారు. ఎరువుల స్టాక్, పంట నమోదు, పీఎం కిసాన్ ఈ కేవైసీల గురించి అడిగి తెలుసుకున్నారు. సీసీఆర్‌కార్డులు కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. వైఎస్సార్ యాప్‌లో తప్పని సరిగా 100 శాతం అటెండెన్స్ ఉండాలన్నారు. సొల్లాపురం గ్రామంలో పప్పుశనగ పంటను ఏడీఏ పరిశీలించారు. ఈ గ్రామంలో చేసిన పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు ఏఓ శ్రవణ్ ఏడీఏ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీఈఓ లాలుస్వామి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో వ్యవసాయాధికారి జగదీష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అమృత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అనిల్, వెటర్నరీ అసిస్టెంట్ సతీష్, వాటర్‌షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు మంగళవారం రైతు రామాంజనేయులు పప్పుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా 5.120 కిలోల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

కూడేరు: మండల కేంద్రంలోని అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి హెల్మెట్ వాడకంపై ఎస్ఐ సత్యనారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఉన్నతపాఠశాలలో హెల్మెట్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

రాయదుర్గం రూరల్: ఉత్తమ ఎంపీడీఓగా గణతంత్ర దినోత్సవం రోజు అనంతపురంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాయదుర్గం ఎంపీడీఓ కొండయ్యను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్డీ రఘురామారావు, పంచాయతీ రాజ్ జేఈ మునయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.